క్లుప్తంగా

ఉన్నత లక్ష్యంతో చదవాలి..



మాట్లాడుతున్న పద్మావతి

నెల్లిమర్ల: బాలికలు ఉన్నత లక్ష్యాలతో విద్యన భ్యసించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ బి. పద్మావతి సూచించారు. పట్టణం లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల గురించి విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. ఏమైనా సమస్యలుంటే కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆమె వెంట డీఈఓ మాణిక్యంనాయుడు, సమగ్రశిక్ష ఏపీసీ రామారావు ఉన్నారు.

రామ మందిరానికి శంకుస్థాపన

విజయనగరం టౌన్: నగరంలోని పూల్‌బాగ్ పీజీ కళాశాల రోడ్డులో అయోధ్య బాలక్ రామ మందిరానికి శనివారం శంకుస్థాపన చేశారు. అయోధ్య బాలక్ రామమందిర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేసిన కార్యక్రమంలో విగ్రహదాత తోట సత్యనారాయణ దంపతులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, కట్టమూరి చంద్రశేఖర్, జి.సన్యాసినాయుడు, 2వ డివిజన్ కార్పొరేటర్ బండారు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఖాదర్‌బాబా శిష్యుడు రవిబాబు కన్నుమూత



రవీంద్రబాబు (ఫైల్)

విజయనగరం టౌన్: సూఫీ సద్గురువు మహ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీబాబా ప్రియశిష్యుడు, న్యాయవాది, ఎల్‌బీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక ట్రస్టీ లింగం రవీంద్రబాబు (రవిబాబు) శుక్రవారం అర్ధరాత్రి కన్నుమూశారు. 15 రోజులుగా తీవ్ర అస్వస్థతతో విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆయన మృతిపట్ల దర్గా, దర్బార్ నిర్వాహకులు ఖలీల్‌బాబు, ఖాజాబాబు, జాఫర్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు.

జాబ్ కార్డు ఉన్నవారికే పని

మెరకముడిదాం: ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న వారే ఉపాధి పనులకు హాజరు కావాలని ఎంపీడీఓ జి.భాస్కరరావు అన్నారు. గొట్టుపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్‌తో కలిసి శనివారం పరిశీలించారు.వేతనదారుల మస్టర్ల సీట్లను తనిఖీ చేశారు. ఈసం దర్భంగా వేతనదారులతో ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం రోజూ రెండు పూటలా పనులు చేయాలని చెప్పారు. ఒకరి పేరుమీద వేరొకరు పనులకు హాజరు కాకూడదన్నారు. పని ప్రదేశంలో ప్రథమ చికిత్స కిట్‌ను అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



జెండా ఊపి సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

దత్తిరాజేరు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపా రు.స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని గ్రామీణ నీటి సరఫరా విభాగం జేఈ కార్తిక్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 35 గ్రామపంచాయతీల్లో తాగునీటి హ్యాండ్ బోర్లకు మరమ్మతులు చేయించనున్నామని చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే వెంటనే పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించాలని సూచించారు.

కౌలు రైతులకు దక్కని భరోసా..!

- వేలాది మంది రైతులున్నా రుణాలు ఇచ్చింది మాత్రం అతి తక్కువ మందికే
- జిల్లాలో కౌలు రైతులు 16,140 మంది
- వీరిలో 1379 మందికే రుణాలు



వరి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

విజయనగరం ఫోర్ట్: అధికారంలోకి వస్తే కౌలు రైతులకు మేలు చేస్తామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పింది. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కౌలు రైతులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలు రైతులకు కూడా సాధారణ రైతుల మాదిరిగా వైఎస్సార్ రైతుభరోసా పథకాన్ని వర్తింపజేసింది. దీంతో వారు పంటల సాగుకు అప్పులు చేసే పరిస్థితి తప్పింది. రైతుభరోసా కింద వారికి రూ. 13,500 చొప్పున ఇవ్వడం వల్ల వారు వాటిని విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు ఉపయోగించుకునేవారు. అదేవిధంగా కౌలు రైతులకు కూడా రుణాలు ఇచ్చారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సాధారణ రైతులకే అన్నదాత సుఖీభవ (వైఎస్సార్‌సీపీ హయాంలో రైతుభరోసా) సాయాన్ని అందించలేదు. ఇక కౌలు రైతుల గురించి చెప్పనవసరం లేదు. ముఖ్యంగా కౌలు రైతులకు రుణాలు పూర్తి స్థాయిలో అందించని పరిస్థితి. వేలాది మంది రైతులు ఉంటే వారిలో కొద్ది మందికి మాత్రమే రుణాలు ఇచ్చారు.

కౌలు రైతులు 16, 140 మంది..

జిల్లాలో కౌలు రైతులు 16,140 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఈ ఏడాది 1379 మందికి మాత్రమే రుణాలు ఇచ్చారు. వీరికి రుణాలు కింద సుమారు ఏడు కోట్ల రూపాయలు కేటాయించారు. వేలాది మంది రైతులుంటే కేవలం వందల మంది రైతులకు మాత్రమే రుణాలు ఇవ్వడంపై అన్నదాతలు పెదవి విరుస్తున్నారు.

రబీలో రుణాలదీ అదే పరిస్థితి..

రబీలో సాధారణ రుణ లక్ష్యం రూ.2,981 కోట్లు కాగా.. ఈ నెల 15వ తేదీ నాటికి రూ.2205 కోట్లు మాత్రమే ఇచ్చారు. అదేవిధంగా టెర్మ్ రుణాల లక్ష్యం రూ. 1140 కోట్లు కాగా.. రూ.897 కోట్లు (78.69 శాతం) ఇచ్చారు.

కౌలురైతుల పరిస్థితి దయనీయం..

సాధారణ రైతుల కంటే కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. సాధారణ రైతులైతే భూమిని హామీగా చూపిస్తే ఏ వ్యాపారి అయినా డబ్బులు ఇచ్చే పరిస్థితి. కాని కౌలు రైతులకు ఆ పరిస్థితి ఉండదు. దీంతో అధిక వడ్డీకి అప్పులు తెచ్చి పంట సాగు చేయాల్సిన పరిస్థితి. ప్రభుత్వం నుంచి సాయం అందక, రుణాలు అందక కౌలు రైతులు ఇబ్బంది పడుతున్నారు.

> **రుణాలిస్తాం..**
> మార్చి నెలఖారు వరకు రుణాలు తీసుకోవడానికి సమయం ఉంది. ఈలోగా పంట రుణాల లక్ష్యాన్ని శతశాతం సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. కౌలు రైతులు ఎక్కువ మందికి రుణాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటాం.
> వి. తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

త్వరితగతిన పైడితల్లి ఆలయ విస్తరణ పనులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి ఆలయ విస్తరణ పనులు త్వరితగతిన చేపడతామని ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక చదురుగుడి ఆలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మార్పు చేసి, స్థలాన్ని యజమానికి అప్పగించారు. అలాగే ఆలయ స్థలానికి క్లియరెన్స్ చేయడానికి గాను శంకుస్థాపన పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి ఇరువైపులా ఉన్న షాపులకు సంబంధించిన స్థలాలను అప్పగించామన్నారు.

ఆకట్టుకున్న కోలాటం..



సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానం ఆవరణలో పలువురు మహిళలు శనివారం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. విజయనగరం పట్టణంలోని దాసన్నపేటకు చెందిన మారుతీ సేవా సంఘం బృంద సభ్యులు రామయ్య సన్నిధిలో వివిధ భక్తి గీతాలకు కోలాటమాడుతూ నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. - నెల్లిమర్ల రూరల్

శ్రీక్షేత్రమ్‌లో ప్రత్యేక పూజలు



విజయనగరం మండలంలోని దుప్పాడ శ్రీ క్షేత్రమ్‌లో కొలువైన అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అన్నకూటోత్సవం కనులపండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేవాలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. - విజయనగరం

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి

- స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వక్తల పిలుపు



విజయనగరం టౌన్: పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న గాజులరేగ నారాయణ స్కూల్ విద్యార్థులు



పూసపాటిరేగ: శ్రమదానంలో పాల్గొన్న ఎంపీడీఓ రాధిక, వైద్యాధికారి రాజేష్‌వర్మ, తదితరులు

పూసపాటిరేగ: ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఎం. రాధిక పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే వ్యాధులు ప్రబలవన్నారు. ప్రజలందరూ కూడా తడి, పొడి చెత్తను వేరు చేసి క్లాప్‌మిత్రలకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌వర్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి, వేదమణి, బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

భాగస్వాములు కావాలి..

నెల్లిమర్ల: పట్టణంలో ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ కె. అప్పలరాజు పిలుపునిచ్చారు. స్థానిక కేజీబీవీ, సువ్వానివీధిలో పర్యటిస్తూ పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ

విజయనగరం గంటస్తంభం: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రలో భాగంగా ఆర్టీసీ బస్‌స్టేషన్, కార్గో కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. రాబోయే తరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీపీటీఓ సీహెచ్.అప్పలనారాయణ, డీఎం జె.శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం టౌన్: సంగీత, నృత్య కళాశాలలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న విద్యార్థులు

మహారాజా కళాశాలలో..

విజయనగరం టౌన్: నగరంలోని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు. అదేవిధంగా గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్‌లో కరస్పాండెంట్ మెయిద నారాయణరావు ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు.

కలెక్టరేట్‌లో..

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఉన్న 34 ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది ఆయా కార్యాలయాల ప్రాంగణాల్లోని చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, సీపీఓ బాలాజీ, కలెక్టరేట్ ఏఓ దేవ్‌ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లిమర్ల: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ అప్పలరాజు, తదితరులు



విజయనగరం గంటస్తంభం: ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది



విజయనగరం అర్బన్: కలెక్టరేట్ ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞలో జేసీ సేతుమాధవన్



విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ (జీవీ)లో ప్రతిజ్ఞ చేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, తదితరులు



విజయనగరం అర్బన్: సీతం విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ

పరిసరాల పరిశుభ్రత అలవర్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



బాబామెట్ట జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడిన ప్రజారోగ్య సిబ్బంది

- నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: చిన్నతనం నుంచే పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక కస్పా హైస్కూల్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రతి తరగతి గదికీ వెళ్లి చెత్త బుట్టలు అందజేశారు. అలాగే పారిశుధ్యం – పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించే పోస్టర్లను కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, ఇతర ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. అలాగే విద్యార్థులచే స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో కస్పా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శంకరరావు, పలువురు ఉపాధ్యాయులు, పారిశుధ్య పర్యవేక్షకుడు శాలేంరాజు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన..

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రజలలో పారిశుధ్యం పట్ల సంపూర్ణ అవగాహన తీసుకొచ్చేందుకు దోహదపడుతుందని విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అభిప్రాయపడ్డారు. స్థానిక బాబామెట్టలోని దేవీపార్కు వద్ద ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ హితాన్ని తెలియజేసే పలురకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. అలాగే మహిళలచే స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లి బాబామెట్ట ప్రధాన జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పేరిట సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు చెప్పారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, టీపీఆర్‌ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, ఏఈ పార్వతి, పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

దత్తిరాజేరు: దాసుపేట గ్రామంలో మూడురోజుల పాటు వైభవంగా కొనసాగిన శ్రీ కోదండరామస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు శనివా రంతో ముగిశాయి. సింహాచలం దేవస్థానం అర్చకులు రేజేటీ శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషే కాలు, హోమాలు నిర్వహించారు. ముగింపు రోజున గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరై సీతారా ములను దర్శించుకున్నారు. వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరరావు, ఫణీంద్రుడు, సన్యాసిరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినతి



తహసీల్దార్ నీలకంఠరావుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

లక్కవరపుకోట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ బి.నీలకంఠరావుకి శనివారం వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి డేగల అప్పలరాజు మాట్లాడుతూ ఎన్నికల సమ యంలో అంగన్‌వాడీలకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీ సిబ్బంది ఎక్కడ ధర్నా చేస్తే అక్కడికి కూటమి నాయకులు వచ్చి తమని గెలిపిస్తే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామని, జీతాలు పెంచు తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణ హామీలను నెరవేర్చాలని కోరారు. త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు అధిక మొత్తంలో నిధులు కేటాయించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.రమణమ్మ,కె.వెంకటలక్ష్మి,గంగేశ్వరి,లక్ష్మి, తదితరులు పాల్గొ న్నారు.